ప్రణాళిక ఉంటే.. పంట పండినట్లే

- సేంద్రియ పద్ధతి పాటిస్తే మంచిది
- నేలను బట్టి పంట మార్పిడి చేయాలి
- ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే నష్టాలకు తావుండదు
- మండల వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు



పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు



పెనుమాడ సమీపంలోని పొలాల్లో గొర్రెల మందలు నిలిపిన దృశ్యం

కృష్ణగిరి: వ్యవసాయ జూదంలో ఏటా అన్నదాతకు కష్టాలు తప్పడం లేదు. ఎంతో ఆశతో పెట్టుబడులు పెట్టి పంట సాగు చేయడం.. తీరా చేతికందే సమయంలో నిరాశపరచడం పరిపాటిగా మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రైతులను అదుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంటల సాగుకు భరోసా కల్పిస్తూ వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారు. అలాగే పంట సాగుకు విత్తనాలు అందించడం నుంచి కోతలు, నూర్పిళ్లు పూర్తయి దిగుబడులు విక్రయించే వరకు గ్రామ స్థాయిలో రైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలందిస్తూ వ్యవసాయాన్ని పండగ చేస్తున్నారు. ఐదో ఏడాది మొదటి విడత రైతు భరోసా సాయం రైతుల ఖాతాలకు జమకావడంతో అన్నదాతలు ఉత్సాహంగా పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఈ సారైనా ముందస్తుగా ప్రణాళికతో పంటలు సాగు చేస్తే మంచి దిగుబడి దక్కుతుందని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో కృష్ణగిరి మండలవ్యాప్తంగా 16 వేల హెక్టార్లలో వేరుశనగ పంట సాగుచేసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. రుతుపవనాల రాక కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో లోతు దుక్కులు, ఎరువులు, పంట యాజమాన్యం వంటి అనేక అంశాలపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు సూచించారు.

భూసారాన్ని బట్టి పంట సాగు చేయాలి

ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకుంటే నేల స్వభావం తెలుస్తుంది. అనవసరమైన మందుల వాడకం నుంచి బయటపడవచ్చు. భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు, యాజమాన్య పద్ధతులు పాటించాలి. దీంతో నేల సారం కోల్పోకుండా ఉంటుంది. భూసార పరీక్ష ద్వారా భూమిలో ఉన్న పోషకాల స్థాయిని తెలుసుకోవచ్చు. భూమిలో ఏ పంటలు వేస్తే అధిక దిగుబడి వస్తుందో తెలుస్తోంది. చౌడు నేలల్లో ఉన్న అమ్ల, క్షార లవణాలను తెలుసుకుని భూమిని సరిదిద్దుకోవచ్చు. పత్తి సాగుచేసిన రైతులు పంట మార్పిడి తప్పక చేపట్టాలి. నాలుగు ఎకరాల్లో పత్తి వేస్తారనుకుంటే ఎకరంలో పత్తి వేసి మిగతా మూడు ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేసుకోవాలి.

సేంద్రియ ఎరువులే భూమికి రక్ష

రసాయన ఎరువులను ఎక్కువగా వాడడం వల్ల భూమిలో అప్పుడు వేసిన పంటకు మాత్రమే పనికి వస్తుంది. తద్వారా భూమిలో లవణాలు తగ్గి సారాన్ని కోల్పోతుంది. అదే పశువుల ఎరువు, గొర్రెల మందలను పొలాల్లో నిలుపుకోవడం వల్ల భూమిలో సారం పెరిగి రెండు మూడేళ్ల ఆ ఎరువులు పనిచేస్తాయి. కాబట్టి ప్రతి రైతు తమ పొలానికి పశువులు, వానపాములు ఎరువులతోపాటు గొర్రెల మందలను పొలాల్లో నిలిపితే నేల సారం పెరుగుతుంది.

మోతాదులోనే ఎరువులు వాడాలి

ఎరువుల యాజమాన్య పద్ధతులను రైతులు సరిగా పాటించాలి. ఎరువులను దుక్కిలో వేసుకోవాలి. నత్రజని ఎరువులను విడతల వారీగా వేసుకోవాలి. పంటకు వేయాల్సిన పోటాషియాన్ని సగం దుక్కిలో వేయాలి, సగం పంటకు వేయాలి. యూరియాను నేరుగా కాకుండా వేప పిండితోగాని, బంకమట్టితో గాని కలిపి వేయాలి. ఇలా చేయడం వల్ల యూరియా అవిరి కాకుండా ఉండటంతోపాటు 100 శాతం పంటకు ఉపయోగపడుతుంది. వరి, పత్తికి రెండో విడతగా భాస్వరాన్ని అసలు వేయకూడదు.

– రాజేష్, ఏఈఓ, కృష్ణగిరి

సేంద్రియంతో నాణ్యమైన దిగుబడులు

జాతీయ సుస్థిర వ్యవసాయ మిషన్ పథకం ద్వారా భూసార పరీక్షలు నిర్వహిస్తే భూమిలో సేంద్రియ పదార్థం తక్కువగా ఉందని తెలిసింది. ఇది చాలా ప్రమాదకర పరిస్థితులకు దారితీస్తుంది. ఇప్పటికైనా ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయాన్ని అలవాటు చేసుకోవాలి. ఎక్కువగా రసాయన ఎరువుల వాడకం వల్ల పంటల దిగుబడిలో పలు సమస్యలు ఎదురవుతాయి. పశువుల ఎరువు, వర్మీ కంపోస్టు ఎరువుల ద్వారా భూసారం పెరగడంతోపాటు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చు. రైతుకు అవసరమైన విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా సబ్సిడీపై పంపిణీ చేస్తున్నాం.

– ఎస్.వెంకటేశ్వర్లు, ఏఓ, కృష్ణగిరి

క్లుప్తంగా

బాధ్యతగా పనిచేయండి



మంత్రి జయరాంను కలిసిన చిప్పగిరి ఎంపీడీఓ సి.వి కొండయ్య

ఆలూరు: ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి బాధ్యతగా విధులు నిర్వర్తించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సూచించారు. స్థానిక మంత్రి నివాసంలో సోమవారం ఆయన్ను చిప్పగిరి ఎంపీడీఓ సి.వి కొండయ్య, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ.. ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తూ ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలన్నారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలను పదేపదే తిప్పుకోకుండా వారి సమస్యలను వెంటనే పరిష్కరించి మెప్పు పొందాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణస్వామి, ఆలూరు మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నందవరం: స్పందన అర్జీల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథ రామయ్య వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శుల కు సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జగనన్నకు చెబుద్దాం కార్యక్రమంలోని సమస్యలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, పరిపాలనాధికారి కృష్ణమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆర్థిక చేయూత

ఎమ్మిగనూరు: అండర్–19 జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు సిద్దార్థ, నడువలయ్యకు ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్ నాయకులు ఆర్థిక సాయం అందించారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాల ప్రాంగణంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాదులు మురళీకృష్ణ, రామకృష్ణ మాట్లాడుతూ ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో క్రీడాకారులు సిద్దార్థ, నడువలయ్య రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటుండడం శుభపరిణామమన్నారు. పోటీల్లో వారు సత్తా చాటాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు ప్రయాణ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు.

ముగుస్తున్న దరఖాస్తు గడువు

కృష్ణగిరి: స్థానిక మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఈ నెల 7వ తేదీతో ముగుస్తుందని ప్రిన్సిపాల్ నిర్మలాకుమారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 200, ఎస్సీ, ఎస్టీలు రూ.150 ఫీజు చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా నిబంధనల ప్రకారం విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు.

11న 'ఆదర్శ' ప్రవేశ పరీక్ష

మద్దికెర: స్థానిక ఆదర్శ పాఠశాలలో 6 వతరగతిలో ప్రవేశానికి ఈనెల 11 వతేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సవిత సోమవారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టికెట్‌తో సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు.

పవర్ స్ప్రేయర్ల పంపిణీ



రామళ్లకోటలో పవర్ స్ప్రేయర్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ తదితరులు

వెల్దుర్తి: సీహెచ్‌సీ పథకం కింద రామళ్లకోట గ్రామంలో 18 మంది రైతులకు సబ్సిడీపై మంజూరైన పిచికారీ యంత్రాలను సోమవారం ప్రజాప్రతినిధులు, నాయకులు పంపిణీ చేశారు. స్థానిక ఆర్బీకేలో వీహెచ్‌ఏ సాంబశివుడు ఆధ్వర్యంలో సర్పంచ్ నిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాధాకృష్ణారెడ్డి, మండల కో–ఆప్షన్ మెంబర్ మాలిక్‌బాషా చేతుల మీదుగా కార్యక్ర మం నిర్వహించారు. రూ.22 వేల విలువ కలిగి న ఒక్కో యంత్రానికి రూ.8వేల సబ్సిడీపోనూ మిగతా మొత్తం బ్యాంకు రుణం, కొంత రైతు వాటాపై అందించినట్లు వీహెచ్‌ఏ తెలిపారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు



వస్త్ర దుకాణం యజమానికి అవగాహన కల్పిస్తున్న కార్మిక శాఖ అధికారులు

ఆలూరు రూరల్: బడి ఈడు పిల్లలను పనుల్లో పెట్టుకుంటే షాపు యజమానులపై చర్యలు తీసుకుంటామని ఆలూరు సహాయ కార్మిక అధికారిణి కనక లక్ష్మి హెచ్చరించారు. ఆమె సోమవారం పోలీసులతో కలిసి పట్టణంలో బాల కార్మికుల నిర్మూలనపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. షాపుల యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆదోని సహాయ కార్మిక అధికారి వెంకట రాముడు, ఏఎస్‌ఐ చంద్రశేఖర్ సిబ్బంది ఉన్నారు.

వైఎస్సార్‌సీపీకే జనం మద్దతు



పత్తికొండలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: ప్రజా సంక్షేమం కోసం పరితపించే నాయకుడు వైఎస్ జగన్‌కే జనం జై కొడుతున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం సాయంత్రం పత్తికొండ గ్రామ సచివాలయం–2 పరిధిలోని 6, 7, 8, 9 వార్డుల్లోని బ్రహ్మయ్యగుడి, ముస్లిం వీధి, చాకలి వీధి, తేరుబజారులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీదేవి అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలసి దాదాపుగా 385 ఇళ్లు తిరిగి ఆయా కుటుంబసభ్యులతో మాట్లాడారు. ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వలంటీర్లు నేరుగా లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి పథకాలు అందిస్తుండడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజల ఆదరణతో మరింత బాధ్యతగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ ఎం.నారాయణదాసు, సర్పంచ్ కొమ్ము దీపిక, నాయకులు ఎస్.నాగరత్నమ్మ, సోమశేఖర్, కారం నాగరాజు, రామచంద్ర, పల్లెప్రతాప్‌రెడ్డి, నీలకంఠ, ఎంపీడీఓ కవిత, సూపరిండెంట్ పార్థసారథి, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



వెంకటేశ్వర్లు, ఏపీపీ, పత్తికొండ



జి.హేమలత, ఏఓ, గోనెగండ్ల



రాణి, ఎంపీడీఓ, ఆస్పరి



కె.సావిత్రి, ఎంపీడీఓ, తుగ్గలి



ఎం.కవిత, ఎంపీడీఓ, పత్తికొండ



కొండయ్య,ఎంపీడీఓ, చిప్పగిరి



కే.విశ్వమోహన్, ఎంపీడీఓ, కృష్ణగిరి

పత్తికొండటౌన్: పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా జి.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా కోవెలకుంట్ల ఏపీపీగా పని చేస్తున్న వెంకటేశ్వర్లును పత్తికొండకు బదిలీ చేశారు. పత్తికొండ కోర్టుకు రెగ్యులర్ ఏపీపీ లేకపోవడంతో ఎమ్మిగనూరు ఏపీపీ గోపాలకృష్ణ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన స్థానంలో వెంకటేశ్వర్లును నియమించగా సోమవారం విధుల్లో చేరారు.

గోనెగండ్ల: మండల ఏఓగా జి.హేమలత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రాజకిషోర్ బదిలీపై ఎమ్మిగనూరు ఫాంకు వెళ్లారు.ఆ స్థానంలో జి.హేమలత సాధారణ బదిలీలలో భాగంగా మద్దికెర నుంచి వచ్చి విధుల్లో చేరారు.

ఆస్పరి: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓగా రాణి బాధ్యతలు చేపట్టారు. ఏఓ రాధ ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఇప్పటివరకు సేవలందించారు. ఎంపీడీఓల బదిలీల్లో భాగంగా సెలవుపై ఉన్న రాణిని ఆస్పరికి నియమించడంతో ఆమె బాధ్యతలు తీసుకున్నారు.

తుగ్గలి: తుగ్గలి మండల పరిషత్ అధికారిగా కె.సావిత్రి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఉన్న ఈఓపీఆర్డీ వీరరాజు పదోన్నతిపై ఎంపీడీఓగా అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గోస్పాడు ఎంపీడీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిణిగా ఉన్న సావిత్రి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

నందవరం: మండల ఎంపీడీఓగా సోమవారం బాధ్యతలు చేపట్టిన దశరథ రామయ్య అనంతరం ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలో గ్రామాలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓకు సూచించారు.

కృష్ణగిరి: స్థానిక ఎంపీడీఓగా విశ్వమోహన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. నంద్యాల జిల్లా డోన్ మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఉన్న మోహన్‌కుమార్ పదోన్నతిపై ఆత్మకూరుకు వెళ్లారు.

పత్తికొండ రూరల్: పత్తికొండ ఎంపీడీఓగా ఎం.కవిత సోమవారం విధుల్లో చేరారు. ఇక్కడ గత కొన్ని నెలల నుంచి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పార్థసారథి పని చేస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆత్మకూరు ఎంపీడీఓగా పనిచేస్తున్న కవితను జిల్లా పంచాయతీరాజ్ అధికారులు పత్తికొండకు బదిలీ చేయడంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు.

చిప్పగిరి: స్థానిక ఎంపీడీఓగా సివి కొండయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ఇక్కడ ఎంపీడీఓగా ఉన్న సుధాకర్ రాజు అనంతపురం జిల్లాకు బదిలీ కాగా ప్యాపిలిలో పీఓగా పనిచేసిన కొండయ్య పదోన్నతిపై చిప్పగిరికి వచ్చి విధుల్లో చేరారు.

సంక్షిప్తం

పనులు పూర్తి చేయండి

తుగ్గలి: పాఠశాలల్లో నాడు–నేడు పనులు పూర్తి చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ ఏఈ మురళి, ఇన్‌చార్జ్ ఎంఈఓ రామ వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక ఎమ్మార్సీలో సోమవారం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో చేపట్టిన పనులపై సమీక్షించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తిచేసేలా కృషి చేయాలని ఆదేశించారు. సీఆర్పీలు పాల్గొన్నారు.

ఉపాధి పథకానికి అనుసంధానించాలి

వెల్దుర్తి: వ్యవసాయాన్ని ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేయాలని, కూలీల ఖర్చులు ప్రభుత్వమే భరించాలని, 90 శాతం సబ్సిడీ రైతులకు అందించాలని, వడ్డీ లేని పంటరుణాలు అందించాలని, నకిలీ పురుగు మందులు నివారించాలన్న పలు డిమాండ్లతో సీపీఐ, అనుబంధ రైతు సంఘాల నాయకులు సోమవారం వ్యవసాయ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ, ఏపీ రైతు సంఘం ప్రతినిధులు మాధవకృష్ణ, రాజు తదితరులు ఏఓ అక్బర్‌బాషాకు వినతిపత్రం అందించారు.

ఆస్పరిలో గ్రామసభ

ఆస్పరి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆస్పరి సచివాలయంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. సచివాలయ కార్యదర్శి రామకృష్ణ, వార్డు సభ్యులు, సిబ్బందిచే పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. వారు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని సూచించారు. కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, ఉప సర్పంచ్ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

7న పత్తికొండ మండల మీట్

పత్తికొండటౌన్: ఈనెల 7వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో పత్తికొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ నారాయణదాసు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కవిత తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. సమావేశానికి మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, కో–ఆప్షన్ సభ్యులు, అన్ని ప్రభుత్వ శాఖల మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ పంపిణీ

నందవరం: కనకవీడు గ్రామానికి చెందిన లింగన్న అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ పుష్పరాణి విషయం తెలుసుకుని సోమవారం కర్నూలు ఆసుపత్రికి వెళ్లి వృద్ధాప్య పింఛన్ రూ.2,750 అందజేసింది. దీంతో లింగన్న, కుటుంబ సభ్యులు వలంటీర్‌కు, సీఎం జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి ప్రవచనాలు

పత్తికొండ రూరల్: టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పుచ్చకాయలమాడ గ్రామంలో మంగళ, బుధ, గురువారం ధార్మిక ప్రవచనాలు కొనసాగుతాయని టీటీడీ జిల్లా కార్యక్రమ నిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి సోమవారం తెలిపారు. గ్రామ శివాలయంలో జరిగే ప్రవచన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగు పండితుడు బత్తిని రాజాజయచంద్రన్ హాజరై ప్రవచనాలు వివరిస్తారన్నారు.

విత్తన మార్పిడికి అవకాశం

తుగ్గలి: ఆర్బీకేల ద్వారా సరఫరా చేసిన సబ్సిడీ వేరుశనగ విత్తనాల్లో నాణ్యత లోపిస్తే రైతులు వాటిని తిరిగిచ్చి, మంచి విత్తనాలు పొందవచ్చని ఏఓ పవన్ కుమార్ తెలిపారు. ఏపీ సీడ్స్ ఫీల్డ్ సూపర్‌వైజర్ జగదీశ్వర రెడ్డితో కలిసి సోమవారం పగిడిరాయి, పి.కొత్తూరు గ్రామాల్లో రైతులు తీసుకున్న సబ్సిడీ వేరుశనగ బుడ్డలను పరిశీలించారు. విత్తనాలను పరిశీలించి ఆవుటన్ శాతం ఏ మాత్రం తగ్గలేదని కాకపోతే కొంత నాసు విత్తనం ఉందన్నారు. వారి వెంట వీఏఏ నాగార్జున ఉన్నారు.

నకిలీలు అరికట్టాలి

నందవరం: నకిలీ విత్తనాలు, ఎరువులు అరికట్టాల్సిన వ్యవసాయ అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పంపన్నగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలో.. రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని, పెట్టుబడిసాయం పెంచాలని, నకిలీ విత్తనాలు, ఎరువులు అరికట్టాలని కోరుతూ ఆ సంఘం నాయకులు ధర్నా నిర్వహించి, అనంతరం తహసీల్దార్ నిత్యానందరాజుకు వినతిపత్రం అందజేశారు.

వర్షం కోసం పూజలు

వెల్దుర్తి: వర్షాలు విస్తారంగా కురవాలని, పంటలు బాగా పండాలని కోరుతూ రామళ్లకోట గ్రామస్తులు సోమవారం శివలింగానికి జలాభిషేక పూజలు నిర్వహించారు. సోమసూత్ర శివలింగోద్భవంగా అవతరించిన మూలవిరాట్ శివలింగం పూర్తిగా మునిగేలా వందల కలశాల నీటితో స్వామి వారి గర్భాలయాన్ని నింపి జలదిగ్బంధం చేశారు. తొలుత శాస్త్రయుక్తంగా, వేద మంత్రాలతో పూజలు నిర్వహించారు. జలాభిషేకం ద్వారా సమృద్ధిగా వర్షాలతో పాటు మంచి జరుగుతుందని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆక్రమణలు తొలగించండి

పత్తికొండటౌన్: స్థానిక చెరువుకట్ట కడగొమ్ము సర్వే నంబరు 95లో వంక పోరంబోకు స్థలంలో ఆక్రమణలు తొలగించాలని నాయీబ్రాహ్మణ సేవా సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు ఆర్డీఓ మోహన్‌దాసును కలసి వినతిపత్రం అందజేశారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప పట్టణానికి చెందిన హుసేని అనే యువకుడిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. హుసేని హొళగుందకు చెందిన యువతిని ఏడాది క్రితం వివాహం చేసుకున్నాడు. గత కొన్ని నెలలుగా అదనపు కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు హుసేన్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు వేలం పాట

పత్తికొండ రూరల్: పందికోన రిజర్వాయర్‌లో చేపల పెంపకానికి మంగళవారం పందికోన గ్రామ సచివాలయ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు ఫిషరీస్ అసిస్టెంట్ వసంత తెలిపారు. ఆసక్తిగల వారు ఉదయం 11 గంటలకు జరిగే వేలంలో పాల్గొనాలని ఆమె కోరారు.

ఎమ్మార్పీకే విక్రయించాలి

మద్దికెర: ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని, అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఓ రవి హెచ్చరించారు. ఆయన సోమవారం స్థానిక కార్యాలయంలో మండల ఫర్టిలైజర్స్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాల వద్ద ఆయా ఉత్పత్తుల ధరలు, స్టాకు వివరాల బోర్డులు ప్రదర్శించాలని సూచించారు.

నీటి సమస్య తీర్చండి

తుగ్గలి: పది రోజులుగా నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని మారెళ్ల గ్రామస్తులు వాపోయారు. గ్రామంలో తాగునీటి బోర్లకు మోటార్లు చెడిపోవడంతో ఊరి చివర ఉన్న బోరు నుంచి మంచినీటిని తెచ్చుకుంటున్నామన్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రాముడును సంప్రదించగా మోటార్లు రిపేరు కాగానే రెండురోజుల్లో నీటి సమస్య పరిష్కరిస్తామన్నారు.

మండల సమావేశం వాయిదా

ఆస్పరి: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ సుంకర ఉమాదేవి అధ్యక్షతన నిర్వహించతలపెట్టిన మండల సర్వసభ్య సమావేశానికి మేజార్టీ ఎంపీటీసీ సభ్యులు హాజరు కాకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీఓ రాధ ప్రకటించారు. త్వరలో సమావేశం నిర్వహించే తేదీని సభ్యులందరికీ తెలియజేస్తామని చెప్పారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అధికారులు పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈఓఆర్డీ సూర్య నరసింహారెడ్డి, ఎంఈఓ రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో కమిషనర్ గంగిరెడ్డి తదితరులు



ఆలూరులో మొక్కను నాటుతున్న న్యాయమూర్తి తరణి


ఎమ్మిగనూరు: మానవ జీవనశైలిలో మొక్కలకు అత్యంత ప్రాముఖ్యత ఉందని, పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి సారించాలన్నారు. వర్షాలు మొదలవగానే పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వైఎస్ చైర్మన్ నజీర్, టీపీఓ గోపాలకృష్ణ, సచివాలయాల కార్యదర్శులు,తదితరులు పాల్గొన్నారు. అలాగే మహాయోగి లక్ష్మమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'పర్యావరణ దినోత్సవం–ప్లాస్టిక్ నిషేధం'పై సెమినార్ నిర్వహించారు. సిబ్బంది పాల్గొన్నారు.

నందవరం: ముగతి జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డీఫ్ సంస్థల నేతృత్వంలో 200 మొక్కలు నాటారు. గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, ఎంపీడీఓ దశరథ రామయ్య పాల్గొని పర్యావరణ ప్రాధాన్యతను వివరించారు.

ఆలూరు రూరల్: ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో జడ్జి తరణి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. న్యాయవాదులు వాయుజీవోత్తమ రావు, ప్రవీణ్ కుమార్, కోర్టు సిబ్బంది ఉన్నారు.

గోనెగండ్ల: మొక్కలను పెంచడం వల్ల ఆరోగ్యంతో పాటు భావితరాలకు ప్రాణవాయువు అందించవచ్చని పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ అన్నారు. గంజిహళ్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పర్యావరణహిత జీవనశైలిపై సదస్సు నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

జల్‌జీవన్ మిషన్‌తో ఇంటింటికీ తాగునీరు



హులేబీడులో కుళాయిలను ప్రారంభిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

ఆలూరు: గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలకు జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శాంతన్న అన్నారు. హుళేబీడులో గతవారం ప్రారంభించిన తాగునీటి కొళాయిలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలూరు మండలం హుళేబీడు గ్రామంలో రూ.32.94 లక్షలతో పైపులైన్ ఏర్పాటు చేసి 570 ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఇచ్చినట్లు చెప్పారు. అదేవిధంగా ముద్దనగేరి గ్రామంలో రూ.25.01 లక్షలతో 196 ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఇచ్చినట్లు వివరించారు. హాలహర్వి మండలం బిలేహాళ్‌లో రూ.37.15 లక్షలతో ఓహెచ్‌ఆర్‌ఎస్ నిర్మించి పైపులైన్ వేసి 53 కొళాయి కనెక్షన్ల ద్వారా తాగునీటి సమస్యను తీర్చామన్నారు. ప్రస్తుతం చిప్పగిరిలో రూ.53.9 లక్షలు, హొళగుంద మండలం ఎండీ హళ్లిలో రూ.36 లక్షలతో పనులు చేపట్టేందుకు టెండరు ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. త్వరలో పనులను ప్రారంభిస్తామని డీఈ శాంతన్న తెలిపారు. జేఈలు మోహన్‌బాబు, లక్ష్మన్న తదితరులు వెంట ఉన్నారు.

తల్లి, కుమార్తెపై దాడి

హాలహర్వి:హాలహర్వి మండలం కామినహాళ్ గ్రామంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో తల్లి, కుమార్తెపై ప్రత్యర్థి వర్గం వారు వేటకొడవళ్లతో దాడికి తెగబడ్డారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కామినహాళ్ గ్రామానికి చెందిన వరలక్ష్మి, కుమార్తె ఐశ్వర్యపై అదే గ్రామానికి చెందిన కేఎస్ మల్లప్ప, ఉసేని, దస్తగిరి తదితరులు వేట కొడవళ్లతో దాడికి పాల్పడ్డారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హాలహర్వి పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బాధితులు ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు

ఆలూరు రూరల్: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా రోగులకు ఇంటి వద్దే మెరుగైన వైద్యం లభిస్తుందని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి అన్నారు. సోమవారం ఆలూరు సచివాలయం–3 పరిధిలో ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలందించారు. వృద్ధులు, రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మాత్రలు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని మందులు అందించారు. గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ఐరన్ ట్యాబ్లెట్లు ఇచ్చారు. సోమవారం 62 మందికి వైద్య సేవలందించినట్లు డాక్టర్ మారుతి తెలిపారు.

జోరుగా విత్తన పంపిణీ

కృష్ణగిరి: మండలంలోని అన్ని ఆర్‌బీకేల ద్వారా వేరుశనగ విత్తన పంపిణీ జోరుగా సాగుతోందని ఏఓ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. మండలానికి 2,100 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించగా ఇప్పటివరకు 1,148 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశామన్నారు. నమోదు చేసుకున్న ప్రతి రైతుకు గరిష్ఠంగా మూడు ప్యాకెట్ల చొప్పున అందజేస్తున్నామని వెల్లడించారు.

సేవలు విస్తృతం చేయండి

నందవరం: గ్రామ సచివాలయాల సేవలు విస్తృతం చేయాలని ఎంపీడీఓ దశరథరామయ్య సిబ్బందిని ఆదేశించారు. ఆయన సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని సచివాలయాలు–1,-2,-3 లలోని సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందన, జగనన్నకు చెబుదాం ద్వారా వచ్చిన సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అర్జీలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.